
సాక్షి
విశాఖపట్నం
గురువారం । 25 । జూలై । 2024



‘పెట్రోలియం’ పనులు పరుగులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీశాశ్వత క్యాంపస్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. 8లో



సమస్యలుంటే చెప్పండి..

జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ తను నిర్దేశించుకున్న 100 రోజుల పరిపాలన మార్పునకు శ్రీకారం చుట్టారు. 8లో



వ్యాన్‌ను ఢీకొన్న బస్సు 8లో

జాతీయ రహదారిపై బుధవారం రాత్రి నంగివలస వద్ద ఆగి ఉన్న వ్యాన్‌ను బస్ ఢీకొట్టడంతో 8 మందికి గాయాలయ్యాయి.

న్యూస్‌రీల్

జగన్‌ను కలిసిన మేయర్ దంపతులు



వైఎస్ జగన్‌తో మేయర్ దంపతులు

దాబాగార్డెన్స్: రాష్ట్రంలో జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, మారణ హోమాలను నిరసిస్తూ దేశ రాజధాని ఢిల్లీలో వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం చేపట్టిన నిరసనలో నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గొలగాని శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ మేరకు పార్టీ అధినేతను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ నేత, రాజ్యసభ సభ్యుడు వై.విజయసాయిరెడ్డిని అతని క్యాంపు కార్యాలయంలో కలిసి పలు అంశాలపై చర్చించారు.

విశాఖ రేంజ్‌కు ఆరుగురు సీఐలు

సీతమ్మధార: విశాఖ రేంజ్‌కు ఆరుగురు సీఐలు బదిలీపై రానున్నారు. విజయవాడ ఏసీబీ హెడ్ ఆఫీస్ నుంచి పి.రామకృష్ణ, విశాఖ ఏసీబీ నుంచి ఎం.చిన్నంనాయుడు, వై.కె.కిశోర్‌కుమార్, కె.వి.సతీష్‌కుమార్, విజయనగరం ఏసీబీ నుంచి టి.శ్రీనివాసరావు, జి.ఎ.వి.రమణలను విశాఖ రేంజ్‌కు బదిలీ చేస్తూ బుధవారం అవినీతి నిరోధక శాఖ అడిషనల్ డైరెక్టర్(ఎఫ్ఎసీ) ఉత్తర్వులు జారీ చేశారు.

కలెక్టర్‌తో జెడ్పీ చైర్‌పర్సన్ భేటీ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

మహారాణిపేట: కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌ను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు సంబంధించి.. విశాఖ జిల్లాతో సంబంధం ఉన్న సమస్యలపై కలెక్టర్‌తో ఆమె చర్చించారు.

పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



మాట్లాడుతున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

విశాఖ సిటీ : వీఎంఆర్‌డీఏ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. బుధవారం వీఎంఆర్‌డీఏ సాంకేతిక విభాగంపై సమీక్ష నిర్వహించారు. ప్రాధాన్యత క్రమంలో మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణ పనులను చేపట్టాలని చెప్పారు. సమావేశంలో ప్రధాన ఇంజినీర్ భవానీశంకర్, పర్యవేక్షక ఇంజినీర్ బలరామరాజు, ఇతర ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఉద్యోగ భవన్‌లో అన్ని అంతస్తులు తిరిగి భవన స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు.

వాహనాల రిజిస్ట్రేషన్ నంబర్ సంఖ్య మార్పు

గోపాలపట్నం: వాహన్ పోర్టల్‌లో వాహనాల 11 అంకెల రిజిస్ట్రేషన్ నంబర్ స్థానంలో 10 అంకెల రిజిస్ట్రేషన్ నంబర్లు వేర్వేరు సిరీస్‌లో ఒకే నంబర్లతో మార్చినట్లు ఉపరవాణా కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫైనాన్షియర్లు, బీమా సంస్థలు ఏదైనా లావాదేవీలకు వెళ్లినపుడు 11 అంకెల సిరీస్‌లో పాతనంబర్ సిస్టమ్‌లో నమోదు చేసినపుడు 10అంకెల కొత్త రిజిస్ట్రేషన్ నంబర్ ప్రదర్శితమవుతుందని పేర్కొన్నారు. ఉదాహరణకు పాతనంబర్ ఏపీ31టీవీఏ బదులుగా ఏపీ39వీకే గా చూపిస్తుందని తెలిపారు. అలాగే ఏపీ31టీవీబీను ఏపీ39వీఎల్‌గా మార్చినట్లు తెలియజేశారు.

26 నుంచి హరికథా ఉత్సవాలు

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి మూడు రోజుల పాటు హరికథా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు అకాడమీ అధ్యక్ష, కార్యదర్శులు మంతెన సత్యనారాయణరాజు, రాంబాబు తెలిపారు. 26న శ్రీకృష్ణ రాయభారం, 27న పురందరదాసు చరిత్ర, 28న భక్త మార్కండేయ హరికథ ప్రదర్శన ఉంటుందన్నారు. ప్రతి రోజూ సాయంత్రం 6.30 గంటల నుంచి ప్రదర్శనలు ప్రారంభమవుతాయని, హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు కృషిని గుర్తు చేసుకుంటూ ఈ ప్రదర్శనలు ఏర్పాటు చేశామన్నారు. అందరూ ఆహ్వానితులేనని పేర్కొన్నారు.

రైల్వేజోన్‌కి రూ. 9 కోట్లే!

అసలు మరిచి.. కొసరే..





ఆదాయంలో ఆకాశమంత ఎత్తులో ఉండే వాల్తేరు డివిజన్‌కు ఏటా కేటాయింపులు మాత్రం అంతంతమాత్రంగానే ఉంటున్నాయి. బడ్జెట్ బంతి భోజనంలో మరోసారి వాల్తేరు డివిజన్‌కు అసలు మరిచి.. ‘కొసరు’ మాత్రమే వడ్డించారు. ముఖ్యంగా కొన్ని ప్రాజెక్టులకు చదివింపుల మాదిరిగా.. వెయ్యి రూపాయల చొప్పున కేటాయించడం ఆశ్చర్యపరిచింది. లైన్ డబ్లింగ్ పనుల నుంచి మానవ రహిత లెవెల్ క్రాసింగుల వరకు.. రైల్వేస్టేషన్లలో మౌలిక సదుపాయాల నుంచి రైల్వే యార్డు రీమోడలింగ్ వరకు దేనికైనా వెయ్యే.! దీన్ని బట్టి **చూస్తే రాష్ట్రంపై కేంద్రానికి ఎంత** చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోంది. ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రజల కల అయిన విశాఖ రైల్వే జోన్‌కు మరోసారి రిక్తహస్తాలు చూపించారు. రాయగడ జోన్ అభివృద్ధితో పాటు జోన్‌కు సంబంధించిన అంబ్రెల్లా వర్క్స్ కోసం కేవలం రూ.9 కోట్లు మాత్రమే కేటాయించి ఈ‘సారీ’ జోన్ రాదని చెప్పకనే చెప్పేశారు.

– సాక్షి, విశాఖపట్నం

- దక్షిణ కోస్తా జోన్ ఏర్పాటుకు ఈ ఏడాదీ మోకాలడ్డు
- 2020–21 అంబ్రెల్లా వర్క్స్ కోసమేనంటూ బడ్జెట్‌లో స్పష్టం
- సింహాచలం–గోపాలపట్నం డబ్లింగ్ లైన్‌కి రూ.1000 మాత్రమే విదిలింపు
- మిగిలిన ప్రాజెక్టులపై దృష్టిసారించిన రైల్వే బోర్డు

‘జోన్’ రైలు.. మరింత ఆలస్యం

ఓ ప్రధాన రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫాం నిర్మించాలంటే రూ.అర కోటి వరకు ఖర్చవుతుంది. అలాంటిది ఒక ప్రతిష్టాత్మకమైన జోన్ ఏర్పాటు చేయాలంటే.. ఎంత మొత్తం నిధులు కేటాయించాలి.? ఒక కొత్త డివిజన్ ఏర్పాటుకు ఎంతివ్వాలి? విత్త మంత్రికి ఇవన్నీ తెలిసినా.. పప్పుబెల్లాలు విదిల్చినట్లు అక్షరాలా రూ.9 కోట్లు మాత్రమే కేటాయించారు. జోన్ ప్రకటించి ఐదేళ్లు దాటింది. బడ్జెట్‌లో జోన్ ఊసే ఎత్తని కేంద్రం మంగళవారం రాత్రి విడుదల చేసిన పింక్ బుక్‌లో విశాఖ కేంద్రంగా ఏర్పాటవుతున్న దక్షిణ కోస్తా రైల్వేజోన్, రాయగడ డివిజన్ అంబ్రెల్లా వర్క్స్ కోసం కేవలం రూ.9 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించడం అందరినీ విస్మయానికి గురిచేసింది. అదిగో ఇదిగో అంటూ ఇన్నాళ్లూ జోన్ కార్యకలాపాల ప్రారంభంపై ఊరించిన కేంద్రం.. బడ్జెట్‌లో కేటాయింపులు చూస్తే వారికెంత ప్రేమ ఉందో అర్థమవుతోంది. ఒక ప్రధాన రైల్వే జోన్ వ్యవస్థ ఏర్పాటు చేసేందుకు అవసరమైన ఫర్నిచర్ కొనుగోలుకు కూడా సరిపోనంతగా కాసులు విదిల్చి.. మమా అనిపించేసింది.

షాక్‌కు గురిచేసిన కేటాయింపులు

విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభించాల్సి ఉంది. ఇప్పటికే దీనికి సంబంధించిన డీపీఆర్‌ను 2019 నవంబర్‌లో జోన్ ఓఎస్‌డీ రైల్వే మంత్రిత్వ శాఖకు అందించారు. 2020 ఏప్రిల్ 1 నుంచి అధికారికంగా జోనల్ కార్యకలాపాలు ప్రారంభమవుతాయని అంతా ఊహించారు. కానీ జరగలేదు. ఈ ఏడాదైనా మంచి జరుగుతుందని భావించినప్పటికీ.. ఊహించని విధంగా బడ్జెట్ కేటాయింపులు అందరినీ షాక్‌కి గురి చేశాయి. జోన్ ఏర్పాటుతో పాటు రాయగడ డివిజన్ ఏర్పాటుకు రూ.170 కోట్లు నిధులు అవసరమని అంచనాలు వేసిన కేంద్రం.. రూ.9 కోట్లు మాత్రమే కేటాయించింది. ఈ నిధులు జోనల్ కార్యకలాపాలకు సంబంధించిన ఏ పని పూర్తిచేసేందుకూ ఉపయోగపడవని వాల్తేరు డివిజన్ అధికారులు సైతం వాపోతున్నారు. ఈ లెక్కన ఈ ఏడాదీ జోన్ కార్యాలయ నిర్మాణ పనులు ప్రారంభమయ్యే సూచనలు లేవని స్పష్టమవుతోంది.

కీలకమైన కొన్ని ప్రాజెక్టులకు బడ్జెట్‌లో కేటాయింపులివీ..

- ఉత్తర సింహాచలం–గోపాలపట్నం 2.07 కిమీ మేర బైపాస్ లైన్ డబ్లింగ్ పనులకు రూ.1000
- ఓర్ ఎక్స్ఛేంజ్ కాంప్లెక్స్(ఓఈసీ)– ఉత్తర సింహాచలం డబ్లింగ్ 5.22 కిమీ పనుల ప్రాజెక్టు విలువ రూ.257.88 కోట్లు కాగా గత బడ్జెట్‌లో రూ.3 కోట్లు విడుదల చేశారు. ఈసారి రూ.38 కోట్లు కేటాయించారు.
- పెందుర్తి ఉత్తర సింహాచలం మధ్య సింహాచలం ప్రాంతంలో సర్ఫేస్ క్రాసింగ్ ఇబ్బందులు తొలగించేందుకు రూ.183.65 కోట్లతో 7.135 కిమీ మేర ఫ్లైఓవర్ ప్రాజెక్టు కోసం రూ.10.63 కోట్లు కేటాయించారు.
- దువ్వాడ– ఉత్తర సింహాచలం మధ్య 20.543 కిమీ మేర థర్డ్, ఫోర్త్ లైన్స్ ప్రాజెక్టు రూ.302.25 కోట్లు వ్యయం కాగా.. రూ.117.18 కోట్లు కేటాయించారు.
- గంగవరం పోర్టు నుంచి వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు వడ్లపూడి గేట్‌ను అనుసంధానిస్తూ 12.04 కిమీ మేర థర్డ్, ఫోర్త్ లైన్స్‌కు రూ.154.28 కోట్లు కాగా.. రూ.79.58 కోట్లు కేటాయించారు.
- విశాఖపట్నం–గోపాలపట్నం మధ్య 15.31 కిమీ మేర రూ.159.47 కోట్లతో థర్డ్, ఫోర్త్ లైన్స్ ప్రాజెక్టు కోసం రూ.55.22 కోట్లు కేటాయించారు.
- గోపాలపట్నం నుంచి దువ్వాడ వరకూ ఆటోమేటిక్ సిగ్నల్ వ్యవస్థకు రూ.1000 కేటాయించారు.
- వాల్తేరు డివిజన్ పరిధిలోని 9 రైల్వే స్టేషన్ల వద్ద డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ వెలుగుల ప్రాజెక్టు వ్యయం రూ.31.37 కోట్లు కాగా రూ.1000 కేటాయించారు.
- గోపాలపట్నం నుంచి సింహాచలం బైపాస్ లైన్, విజయనగరం వరకూ ఆటోసిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటుకు రూ.32.78 కోట్లు కేటాయించారు.
- డివిజన్ పరిధిలో 72.276 కిమీ మేర ఉన్న పలాస–విశాఖపట్నం–దువ్వాడ మధ్య ట్రాక్ రెన్యువల్ పనులకు రూ.50 లక్షలు కేటాయించారు.
- ఉత్తర సింహాచలం నుంచి స్టీల్‌ప్లాంట్‌కు సెంట్రల్ ట్రాక్ రెన్యువల్ పనుల కోసం రూ.కోటి కేటాయించారు.

అరకొర కేటాయింపులతో ఏం చేస్తారో.?



వాల్తేరు డివిజన్ పరిధిలో వివిధ పనులకు జరిగిన కేటాయింపులను ఓసారి పరిశీలిస్తే.. రైల్వే బోర్డు బడ్జెట్ కేటాయింపులు చేసిందా? ఏదో మమా.. అనిపించిందా అన్న అనుమానాలు కలగక మానవు. విశాఖపట్నం రైల్వే స్టేషన్‌పై భారం పడకుండా.. రైలు ప్రయాణాలు సజావుగా సాగాలంటే అత్యంత కీలకమని భావిస్తున్న ఉత్తర సింహాచలం–గోపాలపట్నం డబ్లింగ్ బైపాస్ లైన్(2.07 కిమీ) పనులకు కేటాయించింది కేవలం రూ.వెయ్యి మాత్రమే. గోపాలపట్నం నుంచి దువ్వాడ వరకూ ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థకూ ఇచ్చింది రూ.వెయ్యే. వాల్తేరు డివిజన్ పరిధిలోని 9 రైల్వే స్టేషన్ల వద్ద డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ వెలుగుల ప్రాజెక్టుకీ ఇచ్చింది వెయ్యి రూపాయలే. ఇలా పలు ప్రాజెక్టులకు అరకొరగా అందించిన కేంద్రం.. మరికొన్ని ప్రాజెక్టుల విషయంలో డివిజన్‌పై దాతృత్వం చూపించింది.

కొత్త జైళ్ల ఏర్పాటుకు కేంద్రం సుముఖం

రాష్ట్ర జైళ్ల శాఖ ఐజీ ఇండ్ల శ్రీనివాసరావు



ఐజీ ఇండ్ల శ్రీనివాసరావుకు జ్ఞాపిక అందజేస్తున్న జైలు సూపరింటెండెంట్ కిశోర్

ఆరిలోవ: దేశంలోని పలు రాష్ట్రాల్లో అవసరమైన చోట కొత్తగా జైళ్లు నిర్మించడానికి కేంద్ర ప్రభుత్వం సుముఖంగా ఉందని రాష్ట్ర జైళ్ల శాఖ ఐజీ ఇండ్ల శ్రీనివాసరావు తెలిపారు. విశాఖ కేంద్ర కారాగారంలో ‘బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ న్యూఢిల్లీ’ ఆధ్వర్యంలో ఈనెల 22న ప్రారంభమైన కొత్త నేర చట్టాలపై జాతీయ సదస్సు బుధవారం ముగిసింది. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఏఏ జిల్లాల్లో కొత్తగా జైళ్లు ఏర్పాటు అవసరమో జిల్లా కమిటీలు వేయాలని సూచించిందన్నారు. ఆ సూచనల మేరకు జిల్లాల్లో కలెక్టర్, జిల్లా ఎస్పీ, జైల్ సూపరింటెండెంట్‌తో కూడిన కమిటీ వేశామన్నారు. ఆ కమిటీలు తయారు చేసిన నివేదికలను జైళ్ల శాఖ సుప్రీంకోర్టుకు పంపించిందని తెలిపారు. ఆ నివేదికలను పరిశీలించిన సుప్రీంకోర్టు కొత్త జైళ్ల ఏర్పాటుకు సంబంధించిన అన్ని వివరాలతో నివేదిక పంపించాలని సూచించిందన్నారు. దాని ప్రకారం రాష్ట్రంలో కొత్తగా జైళ్ల నిర్మాణం కోసం సుమారు రూ.400 కోట్లు అవసరమని జైళ్ల శాఖ నుంచి సుప్రీంకోర్టుకు మరో నివేదిక పంపించామని వివరించారు.

కొత్త నేర చట్టాలపై అవగాహన అవసరం

కొత్త నేర చట్టాల గురించి జైలు అధికారులు, కింది స్థాయి సిబ్బందికి వివరించేందుకే జాతీయ స్థాయి సదస్సు నిర్వహించినట్లు రాష్ట్ర జైళ్ల శాఖ ఐజీ ఇండ్ల శ్రీనివాసరావు తెలిపారు. ఇ.ఎన్.ఎల్.ఎస్.యు న్యాయ కళాశాల, ఎన్.వి.ఎన్ న్యాయ కళాశాల, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ న్యాయ కళాశాలలకు చెందిన పలువురు ప్రొఫెసర్లు మూడు రోజుల పాటు కొత్త నేర చట్టాలపై జైలు అధికారులకు అవగాహన కల్పించారు. సదస్సులో భాగంగా పలువురు న్యాయ నిపుణులు, జైలు అధికారులు కొత్త చట్టాలపై పలు సలహాలు, సూచనలు చేశారని.. ఈ అంశాలతో నివేదిక రూపొందించి బీపీఆర్‌డీకి అందజేస్తామని ఈ సందర్భంగా ఐజీ తెలిపారు. అనంతరం ఐజీకి విశాఖ కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ ఎస్.కిశోర్‌కుమార్, అడిషనల్ సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వరరావు జ్ఞాపిక అందజేశారు. ఏపీతో పాటు తమిళనాడు, జార్ఖండ్, ఢిల్లీ, కర్నాటక రాష్ట్రాల జైళ్ల సూపరింటెండెంట్లు, డిప్యూటీ సూపరింటెండెంట్లు, జైలర్లు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా పటిష్ట చర్యలు

కలెక్టర్ హరేందిర ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, చిత్రంలో జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

మహారాణిపేట: జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని, అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో బుధవారం జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్‌తో కలిసి కలెక్టరేట్ మీటింగ్ హాలులో వివిధ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వ్యాధులు వ్యాప్తి చెందకుండా పాటించాల్సిన ముందు జాగ్రత్తలపై కలెక్టర్ మార్గదర్శకాలు జారీ చేశారు. ఒక్క వైద్యారోగ్య, మలేరియా విభాగంతోనే ప్రజల ఆరోగ్య పరిరక్షణ సాధ్యం కాదని, అన్ని విభాగాల అధికారులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో స్వచ్ఛంద పారిశుధ్య చర్యలు చేపట్టాలని, ఫ్రైడే.. డ్రైడే తప్పకుండా పాటించాలని ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, కార్పొరేట్ సంస్థల పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి గంబూషియా చేపలను విడిచిపెట్టాలన్నారు. ఎక్కడైనా జ్వరాల కేసులు నమోదైతే సంబంధిత విభాగం అధికారులకు సమాచారం అందించాలన్నారు. పట్టణ మురికి వాడలపై దృష్టి సారించి ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. ఏ రోజు తాగు నీరు ఆ రోజే సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ కమిషనర్‌కు సూచించారు. కమిషనర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రభావిత ప్రాంతాల్లో తక్షణ పారిశుధ్య చర్యలు చేపడతామన్నారు. ప్రజలు కూడా బాధ్యతగా మెలగాలని, ఎక్కడబడితే అక్కడ చెత్త వేయవద్దన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా మలేరియా నివారణ అధికారి తులసి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, ఇతర విభాగాల జిల్లా స్థాయి అధికారులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణలో భాగస్వాములు కండి

జిల్లాలో వ్యాధులు ప్రబలకుండా తీసుకునే చర్యల్లో భాగస్వామ్యం కావాలని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు కలెక్టర్ ఎం.ఎన్. హరేందిరప్రసాద్ సూచించారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో బుధవారం జిల్లాలోని వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలెక్టరేట్ మీటింగ్ హాలులో ఆయన సమావేశమయ్యారు. మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, ఇతర సీజనల్ వ్యాధుల నివారణకు జిల్లాలో పలు రకాల చర్యలు చేపడుతున్నామని, ఇప్పటికే అన్ని విభాగాల అధికారులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశామని కలెక్టర్ వారికి వివరించారు. జిల్లా యంత్రాంగం చేపట్టే చర్యల్లో స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యం కావాలని, అటు ప్రజలకు, ఇటు అధికార యంత్రాంగానికి సహకరించాలన్నారు. జిల్లా మలేరియా నివారణ అధికారి తులసి వివిధ అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. వ్యాధులు ప్రబలడానికి కారణాలు, నివారణ మార్గాలను ఆమె వివరించారు. పలువురు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు తమ సలహాలు, సూచనలు తెలిపారు. డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు పాల్గొన్నారు.

కి‘లేడీ’ అరెస్ట్

- అందమైన అమ్మాయి ఫొటోతో నకిలీ ఇన్‌స్టాగ్రామ్ సృష్టి
- మ్యాట్రిమోనీలో రిజిస్టర్ అయిన యువకులకు వల
- ఆన్‌లైన్ మెసేజ్‌లు పంపిస్తూ పెళ్లి చేసుకుంటామని మోసం

విశాఖ సిటీ: అందమైన అమ్మాయి ఫొటోతో నకిలీ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌ను సృష్టించింది. మ్యాట్రిమోనీ సైట్లలో రిజిస్టర్ అయిన యువకులకు ఆన్‌లైన్‌లో పరిచయం చేసుకుని పెళ్లి చేసుకుంటామని నమ్మించింది. ఆ తర్వాత గిఫ్ట్ రూపంలో డబ్బులు కాజేస్తున్న మహిళను సైబర్ క్రైం పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. నగరానికి చెందిన పెళ్లి కానీ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఒక మహిళ పెళ్లి పేరుతో పరిచయం చేసుకుంది. తరువాత వాట్సాప్ నంబర్ తీసుకొని అందమైన అమ్మాయి ఫొటో పెట్టి ఛాటింగ్ చేసింది. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వ్యక్తిగత సమాచారం సేకరించింది. ఎమోషనల్‌గా దగ్గరైనట్లు మెసేజ్‌లు చేసి.. డబ్బు అవసరమని చెప్పి రూ.22 లక్షలు అకౌంట్‌లో వేయించుకొని మోసం చేసింది. దీంతో బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన సీఐ భవానీప్రసాద్ సాంకేతికత సహాయంతో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను మోసం చేసింది హైదరాబాద్‌కు చెందిన బతిన సాయి ప్రియ(32)గా గుర్తించారు. ఆమెను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు.

దివ్యాంగుల సాధికారత అవార్డులకు దరఖాస్తులు

మహారాణిపేట: దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తున్న వ్యక్తులు, స్వచ్ఛంద సంస్థల నుండి జాతీయస్థాయి అవార్డుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకురాలు జె.మాధవి ప్రకటనలో తెలిపారు. మినిస్ట్రీ ఆఫ్ నేషనల్ జస్టిస్, ఎంపవర్‌మెంట్ ఈ అవార్డులను అందజేస్తుందని తెలియజేశారు. అర్హులు ఈ నెల 31వ తేదీలోగా www.depwd.gov.in లేదా www.awards.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అప్లికేషన్లు/నామినేషన్లు కేవలం ఆన్‌లైన్ ద్వారా మాత్రమే అనుమతిస్తారని పేర్కొన్నారు. ఎంపికైన వారికి డిసెంబర్ 3వ తేదీన అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా అవార్డులు ప్రదానం చేస్తారని వివరించారు.

ఓపీ.. బీపీ

కేజీహెచ్ ఓపీ టికెట్ల జారీకి అధికారులు అభా యాప్‌ను ఉపయోగించటం వల్ల తీవ్ర జాప్యం జరుగుతోందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేద రోగుల వద్ద స్మార్ట్ ఫోన్ లేక, యాప్ డౌన్‌లోడ్ చేయలేక, సెల్‌ఫోన్‌కు సిగ్నల్ లేక, ఆధార్ అప్‌డేట్ కాక, వేలి ముద్రలు సరిగా పడకపోవడం వంటి సమస్యల వల్ల యాప్ సకాలంలో డౌన్‌లోడ్ కాక రోగులు, వారి బంధువులకు నిరీక్షణ తప్పడం లేదు. అలాగే రద్దీకి అనుగుణంగా ఓపీ కౌంటర్లు కూడా సరిపడినన్ని ఏర్పాటు చేయకపోవడం వల్ల రోగులు ఓపీ టికెట్లు పొంది వెళ్లే సరికి సమయం అయిపోయిందని వైద్యులు అందుబాటులో ఉండటం లేదు.

- యాప్ ద్వారా కేజీహెచ్ ఓపీ టికెట్ల జారీ
- ఈ విధానం వల్ల సమయం వృథా అవుతోందని రోగుల ఆవేదన
- రద్దీకి సరిపడినన్ని కౌంటర్లు లేక టికెట్ల జారీలో తీవ్ర జాప్యం
- తీరా ఓపీ టికెట్ దొరికి వెళ్లే సరికి సమయాభావం వల్ల అందుబాటులోని లేని వైద్యులు





ఓపీ టికెట్ల కోసం బారులు తీరిన రోగులు, వారి బంధువులు

మహారాణిపేట: కేజీహెచ్ అవుట్ పేషెంట్ (ఓపీ) విభాగంలో బుధవారం టికెట్ల కోసం రోగులు నానా అవస్థలు పడ్డారు. ఎప్పుడూ లేని విధంగా ఓపీ కౌంటర్లన్నీ రోగులు, వారి బంధువులతో నిండిపోయాయి. ఒక వైపు కౌంటర్లలో ఆధార్ కార్డు ద్వారా కంప్యూటర్ టికెట్ల జారీ, మరొక వైపు అభా యాప్ ద్వారా ఓపీ టికెట్లు జారీ చేస్తున్నారు. ఈ యాప్ డౌన్‌లోడ్ కాకపోవడంతో రోగులు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది.

పడిగాపులు పడ్డ రోగులు..

కేజీహెచ్‌లోని ఆరు ఓపీ కౌంటర్లు రోగులు, వారి బంధువులతో కిటకిటలాడాయి. వారిని అదుపు చేయడం సెక్యూరిటీ సిబ్బంది వల్ల కాలేదు. నిత్యం కేజీహెచ్ ఓపీలో 1,200 నుంచి 1,300 వరకు టికెట్లు జారీ చేస్తారు. కానీ కొద్దిగా వర్షాలు తగ్గుముఖం పట్టడంతో బుధవారం రోగులు పెద్ద సంఖ్యలో వచ్చారు. 1,800 మందికి ఓపీ టికెట్లు జారీ, 80 మందికి కేస్‌షీట్లు జారీ చేశారు. ఈ రద్దీ మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగింది. ఆన్‌లైన్ ఓపీ టికెట్లలో రోగి పేరు, వయసు, చిరునామా రాసి ఇస్తున్నారు. అలాగే రోగులు ఏ ఓపీకి వెళ్తున్నారో అందులో తప్పనిసరిగా రాస్తున్నారు.

అందుబాటులో లేని వైద్యులు..

అష్టకష్టాలు పడి ఓపీ టికెట్ సాధించుకుంటే తర్వాత వైద్యులు అందుబాటులో లేక రోగులు ఆందోళన చెందుతున్నారు. ఓపీలో 11 గంటల వరకు వైద్యులు అందుబాటులో ఉంటారు. బుధవారం 11 గంటల తర్వాత ఎంతో మంది ఓపీ టిక్కెట్లు తీసుకుని వైద్యులుండే ఓపీ గదికి వెళ్లారు. అప్పటికే వైద్యులు వెళ్లిపోవడంతో రోగులు ఉసూరుమన్నారు. ఏం చేయాలో తెలియక కొద్ది సేపు అక్కడుండి తర్వాత వెళ్లిపోయారు. ఓపీలో ఉండే సిబ్బందిని అడిగితే సరైన సమాధానం రాకపోవడంతో రోగులు వెనుదిరిగారు.

యాప్‌తో కష్టాలు..

ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ (ఏబీహెచ్ఏ) యాప్ డౌన్‌లోడ్‌లో రోగులు, వారి బంధువులు అష్టకష్టాలు పడుతున్నారు. ఈ యాప్‌ను ఆస్పత్రి వర్గాలు తప్పనిసరి చేశాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే పేద రోగుల వద్ద స్మార్ట్ ఫోన్ లేక, యాప్ డౌన్‌లోడ్ చేయలేక గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. యాప్‌ను సిబ్బంది డౌన్‌లోడ్ చేస్తున్నప్పటికీ చాలా సమయం పడుతోంది. అలాగే సెల్‌ఫోన్‌కు సిగ్నల్ లేకపోవడం, ఆధార్ అప్‌డేట్ కాకపోవడం, వేలి ముద్రలు సరిగా పడకపోవడం వంటి సమస్యల వల్ల యాప్ సకాలంలో డౌన్‌లోడ్ కాక రోగులు, వారి బంధువులకు నిరీక్షణ తప్పలేదు.

ఓపీ కౌంటర్లు పెంచుతాం..



ఓపీ కౌంటర్ల సంఖ్య పెంచుతాం. ప్రస్తుతం ఉన్న కౌంటర్లను ఆర్ఎంవో డాక్టర్ కిరణ్ ద్వారా పరిశీలిస్తున్నాం. రోగులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. సోమవారం, బుధవారం, శుక్రవారం ఓపీ సంఖ్య పెరుగుతుంది. ఆ రోజుల్లో అదనపు సిబ్బందిని నియమించి సమస్యను సరిదిద్దుతాం.

– డాక్టర్ శివానంద్, సూపరింటెండెంట్, కేజీహెచ్

ఓపీ టికెట్ దొరికింది.. వైద్యులు ఉంటారో లేదో..



ఓపీ టిక్కెట్ కోసం ఉదయాన్నే వచ్చాం. నా భార్యకు బాగు లేకపోతే నేను లైన్‌లో నిలబడ్డాను. నా భార్యను బయట కూర్చోబెట్టాను. జనం చాలా ఎక్కువగా ఉన్నారు. ఇప్పుడు టికెట్ దొరికింది. వైద్యులు ఉంటారో లేదో తెలియడంలేదు.

– సత్తిరాజు, సీతంపేట

ఆగి ఉన్న వ్యాన్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

ఎనిమిది మందికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు



ప్రమాదంలో నుజ్జయిన బస్సు ముందు భాగం

తగరపువలస: జాతీయ రహదారిపై సంగివలస వద్ద బుధవారం రాత్రి 11.30కు జరిగిన రోడ్డు ప్రమాదంలో 8 మందికి గాయాలయ్యాయి. శ్రీకాకుళం నుంచి విశాఖ వైపు వస్తున్న నాన్ స్టాప్ బస్సు సంగివలస వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న వ్యాన్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగిన సమయంలో చినుకులు పడుతున్నందున బస్సు డ్రైవర్‌కు సరిగా కనిపించకపోవడంతో వ్యాన్‌ను కుడి వైపు నుంచి ఓవర్‌టేక్ చేయబోయి ఈ ప్రమాదానికి గురైనట్టు తెలిసింది. ప్రమాదంలో క్షతగాత్రులను భీమిలి పోలీసులు సంగివలస అనిల్ నీరుకొండ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

సమస్యలుంటే చెప్పండి..పరిష్కరిస్తా..

ఉద్యోగులకు జీవీఎంసీ కమిషనర్ సూచన



మరుగుదొడ్లు పరిశీలిస్తున్న కమిషనర్

డాబాగార్డెన్స్: జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ తను నిర్దేశించుకున్న 100 రోజుల పరిపాలన మార్పునకు శ్రీకారం చుట్టారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని అన్ని విభాగాలు, సెల్లార్‌లోని బ్యాటరీ కార్ పార్కింగ్ ఆవరణ, సౌకర్య కేంద్రం, సచివాలయం తదితర విభాగాలు, ఉన్నతాధికారుల గదులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి క్రమశిక్షణ కలిగి ఉండాలని, పరిసరాల పరిశుభ్రత తో పాటు కార్యాలయం కూడా పరిశుభ్రంగా ఉండేలా మంచి వాతావరణంలో విధులు నిర్వర్తించాల ని సూచించారు. కార్యాలయాల్లో ఉద్యోగులకు కల్పించిన మౌలిక సదుపాయాల్లో లోపాలుంటే.. వెంటనే కార్యాలయ ఇన్‌చార్జికి తెలియజేయాలన్నా రు. ఆయన పరిశీలనలో కార్యాలయ విభాగాలు, పలుచోట్ల మరుగుదొడ్లు పరిశుభ్రంగా లేవని గుర్తించారు. వాటిని ఎప్పటికప్పుడు పరిశుభ్రపరిచేలా చర్యలు చేపట్టాలని కార్యాలయ ఇన్‌చార్జి డీఈఈ వేంకటేశ్వరరావును, ప్రధాన కార్యాలయ ఆవరణ లో నీడనిచ్చే మొక్కలు నాటాలని డీడీహెచ్ దామోదరరావును ఆదేశించారు. డ్రైనేజీ వ్యవస్థ సరిచేయాలని, కార్యాలయ ప్రాంగణంలో అస్తవ్యస్తంగా ఉన్న వ్యర్థాలను తొలగించాలని, వినియోగానికి పనికిరాని వస్తువులను వేలం వేయాలని, కార్యాలయా ల్లో విద్యుత్ బల్బులు ఏర్పాటు చేయాలని పర్యవేక్షక ఇంజినీర్ సత్యనారాయణరాజుకు సూచించారు. జీవీఎంసీ అదనపు కమిషనర్లు వై.శ్రీనివాసరావు, వి.సన్యాసిరావు, ఎస్ఎస్ వర్మ, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, కార్యదర్శి పి.నల్లనయ్య, పర్యవేక్షక ఇంజనీర్లు పాల్గొన్నారు.

గంజాయితో వ్యక్తికి జైలు

పరవాడ: గంజాయి కలిగి ఉన్న నీలకాయల మోహన్ అనే వ్యక్తికి అనకాపల్లి 10వ అదనపు జిల్లా జడ్జి నందనవనం శ్రీవిద్య 4 సంవత్సరాల 5 నెలల కారాగార శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెలువరించారని పరవాడ సీఐ ఎస్.బాలసూర్యారావు చెప్పారు. లంకెలపాలెం జంక్షన్‌లో 2020 జనవరి 24న బ్యాగు తగిలించుకొని అనుమానాస్పదంగా సంచరిస్తున్న అనకాపల్లి మండలం శంకరం గ్రామానికి చెందిన నీలకాయల మోహన్‌ను పరవాడ పోలీసులు తనిఖీ చేయగా అందులో 4 కిలోల గంజాయిని గుర్తించారు. వెంటనే అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. తదుపరి విచారణ పూర్తయిన తర్వాత ముద్దాయికి పైవిధంగా తీర్పు వెలువరించారని సీఐ బాలసూర్యారావు తెలిపారు.

'పెట్రోలియం' పనులు పరుగులు



చురుగ్గా క్యాంపస్ నిర్మాణ పనులు

- వచ్చే విద్యా సంవత్సరానికి ఐఐపీఈకి శాశ్వత భవనాలు
- సబ్బవరం మండలం వంగలిలో రూ.655.46 కోట్లతో సాగుతున్న పనులు
- 200 ఎకరాల విస్తీర్ణంలో పర్యావరణ హిత భవనాలు

ఐఐపీఈ కొత్త క్యాంపస్ విస్తీర్ణం	201.80 ఎకరాలు
భవనాల విస్తీర్ణం	65,000 చ.మీటర్లు
మొత్తం ప్రాజెక్టు వ్యయం	రూ.655.46 కోట్లు
మొత్తం ఎన్ని దశల్లో నిర్మాణం	2 దశల్లో
తొలి దశలో	950 మంది విద్యార్థులకు అనుగుణంగా నిర్మాణాలు
మొదటి దశ పూర్తయ్యేది	2025 జూన్‌లో
మొత్తం ఎన్ని విభాగాల భవనాలు	11
డిజైన్లు తయారు చేసిన సంస్థ	ముంబైకి చెందిన ఆర్కిటెక్చరల్ సంస్థ
కాంట్రాక్టు- సీపీడబ్ల్యూడీ ఆధ్వర్యంలో	కేపీసీ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ సంస్థ

సాక్షి, విశాఖపట్నం: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ(ఐఐపీఈ) శాశ్వత క్యాంపస్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భూ ఇబ్బందులను తొలగించిన తర్వాత పనులు జోరందుకున్నాయి. 2016 నుంచి ఏయూలోని ఇంజినీరింగ్ కాలేజీలో తరగతులు నిర్వహిస్తున్నారు. శాశ్వత భవన నిర్మాణానికి అదే సంవత్సరం అక్టోబర్‌లో శంకుస్థాపన చేసినా భూ అడ్డంకులతో నిలిచిపోయాయి. నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో భూ కేటాయింపు సమస్యలు పరిష్కారమయ్యాయి. 200 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో రూ.655.46 కోట్లతో చేపడుతున్న క్యాంపస్‌లో వచ్చే విద్యాసంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించేందుకు సన్నద్ధమవుతున్నారు.

పరిశోధనలు పెంచాలనే లక్ష్యంతో..

ఉమ్మడి విశాఖ జిల్లాలో హెచ్‌పీసీఎల్‌తో పాటు నక్కపల్లి, రాంబిల్లి పారిశ్రామిక క్లస్టర్లు కీలకమైనవి. సమీపంలోనే ఉన్న కృష్ణా గోదావరి పరివాహక ప్రాంతం (కేజీ బేసిన్)లో అపారమైన చమురు, సహజవాయువు నిల్వలున్నాయి. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ రంగంలో నిపుణులు, నైపుణ్యమున్న సిబ్బంది కొరత ఉంది. ఈ లోటును పూడ్చడంతో పాటు చమురు, ఇంధన రంగ అభివృద్ధికి అవసరమైన పరిశోధనలు పెంచాలనే లక్ష్యంతో విశాఖలో ఐఐపీఈ ఏర్పాటుకు విభజన చట్టంలో భాగంగా కేంద్రం మొగ్గు చూపింది. కేంద్ర చమురు, సహజవాయువుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పూర్తి స్వతంత్ర ప్రతిపత్తితో పనిచేసే ఈ ఇన్‌స్టిట్యూట్‌కు ప్రభుత్వ రంగ సంస్థలైన హెచ్‌పీసీఎల్, ఐఓసీఎల్, ఓఎన్‌జీసీ, గెయిల్, ఐఓఎల్ సహకారం అందిస్తుంటాయి. ఏయూలో ఐఐపీఈ తాత్కాలిక క్యాంపస్ 2016లో ఏర్పాటు చేశారు.

చురుగ్గా సాగుతున్న పనులు

శాశ్వత క్యాంపస్ నిర్మాణ పనులకు సంబంధించిన ప్రాజెక్టుకు సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (సీపీడబ్ల్యూడీ) ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీగా వ్యవహరిస్తోంది. కేపీసీ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ సంస్థకు కాంట్రాక్టు బాధ్యతలు అప్పగించారు. 2022లో శంకుస్థాపన చేసి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం ఈ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈస్టర్న్ అకాడమీ బ్లాక్, మూడు హాస్టల్ బ్లాక్‌లు, మెస్ బ్లాక్, 8 విభాగాలకు సంబంధించిన క్వార్టర్స్, గెస్ట్ హౌస్, డైరెక్టర్ రెసిడెన్సీ, ఓవర్‌హెడ్ ట్యాంక్ మొదలైన భవనాల నిర్మాణ పనులు జోరందుకున్నాయి. వచ్చే ఏడాది జనవరి నాటికి నిర్మాణ పనులు పూర్తి చేసి.. జూన్ కల్లా క్యాంపస్ సమగ్రంగా సిద్ధం చెయ్యాలని అధికారులు భావిస్తున్నారు. అందుకనుగుణంగానే పనులు వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు వడివడిగా అడుగులు వేస్తున్నారు.



ఐఐపీఈ నూతన క్యాంపస్ నిర్మాణ డిజైన్‌లు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చొరవతో..

ఐఐపీఈ శాశ్వత క్యాంపస్ నిర్మాణానికి సబ్బవరం మండలంలోని వంగలి గ్రామ పరిధిలో సర్వే నంబరు 135/2లో 147.58 ఎకరాలు, 241/3లో 54.22 ఎకరాలు చొప్పున మొత్తం 201.80 ఎకరాల్ని కేటాయించారు. ఇందులో కొంతమేర డీ పట్టా భూములుండగా.. కొందరు రైతులు ఆక్రమించి సాగు చేసుకుంటున్నారు. వీరిలో 19 మంది రైతులు 20.08 ఎకరాలకు సంబంధించి పరిహారం విషయమై కోర్టును ఆశ్రయించారు. నిర్ణీత సమయంలో నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చెయ్యకపోతే నిధులు వెనక్కి వెళ్లిపోయే ప్రమాదం ఉన్నా.. ఈ వివాదాలను పరిష్కరించడంలో గత టీడీపీ ప్రభుత్వం అశ్రద్ధ వహించింది. దీంతో భూమి స్వాధీన ప్రక్రియ పెండింగ్‌లో ఉండిపోవడంతో పనులు నిలిచిపోయాయి. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దీనిపై దృష్టిసారించి.. స్థానిక రైతుల డిమాండ్‌లకు అంగీకరించింది. దీంతో క్యాంపస్ నిర్మాణ పనులకు మార్గం సుగమమైంది.

హరిత భవనాలు నిర్మిస్తున్నాం



నూతన క్యాంపస్ నిర్మాణ పనులు సీపీడబ్ల్యూడీ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. సెంట్రల్ అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, ఈస్టర్న్ అకడమిక్ బ్లాక్, బాయ్స్ హాస్టల్, డైనింగ్ మొదలైన 11 భవనాల నిర్మాణ పనులు పూర్తవుతున్నాయి. మొదటి దశ నిర్మాణ పనులు 2025కు పూర్తవుతాయని భావిస్తున్నాం. ఇప్పటికే శాశ్వత ప్రాంగణం చుట్టూ ఏపీఐఐసీ సహకారంతో ప్రహరీ నిర్మాణం పూర్తి చేశాం. వచ్చే ఏడాది తరగతులు కొత్త క్యాంపస్‌లో ప్రారంభించాలని ఆశిస్తున్నాం. మొత్తం భవనాలన్నీ హరిత భవనాలుగా రూపుదిద్దుకుంటున్నాయి. గ్రీన్ బిల్డింగ్ పారామీటర్స్‌తో గ్రిహ రేటింగ్ (గ్రీన్ రేటింగ్ ఫర్ ఇంటిగ్రేటెడ్ హ్యాబిటేట్ అసెస్‌మెంట్)తో ఇంధన సంరక్షణ బిల్డింగ్ కోడ్ నిబంధనలకు అనుగుణంగా నిర్మాణం చేస్తున్నాం. మొత్తం 65,000 చ.మీటర్ల విస్తీర్ణంలో భవనాలు నిర్మితమవుతున్నాయి.

– ప్రొ.శాలివాహన్, ఐఐపీఈ డైరెక్టర్

తహసీల్దార్ల రాక.. మరింత ఆలస్యం?

మహారాణిపేట: ఎప్పుడు సొంత జిల్లాలకు వెళ్లిపోదామని సామాన్లు సర్దుకుని సిద్ధంగా ఉన్న తహసీల్దార్లకు చిక్కులు ఎదురవుతున్నాయి. విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో తహసీల్దార్లను రిలీవ్ చేయడానికి ఉత్తరాంధ్ర జిల్లాల కలెక్టర్లు ఆలోచిస్తున్నారు. సొంత జిల్లాలకు వెళ్లడానికి ప్రభుత్వం అన్ని అనుమతులు ఇవ్వడంతో జోన్-1(ఉత్తరాంధ్ర జిల్లాలు)లో పనిచేస్తున్న తహసీల్దార్లు సిద్ధంగా ఉన్నారు. ముందు అనుకున్న ప్రకారం గత బుధవారం సాయంత్రం తహసీల్దార్లను రిలీవ్ చేయాలని నిర్ణయించారు. కానీ ఆ రోజు ఉదయం నుంచి వర్షాలు కురుస్తుండంతో.. ఈ కార్యక్రమం వాయిదా పడింది. విశాఖ జిల్లాలో తహసీల్దార్లు రిలీవ్ ఫైల్‌ను అధికారులు సిద్ధం చేసి కలెక్టర్ బంగ్లాకు పంపినట్టు తెలిసింది. అయితే ఎప్పుడు రిలీవ్ చేస్తారన్న అంశంపై సందిగ్ధత నెలకొంది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ ఏడాది జనవరి 31న విశాఖ నుంచి మొత్తం 19 మందిని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు బదిలీ చేశారు. అక్కడ నుంచి వచ్చిన 19 మంది విశాఖలో విధుల్లో చేరిన సంగతి తెలిసిందే..


ఇద్దరు పిల్లల కిడ్నాప్!

- ఒడిశాలోని గంజాంలో ఫిర్యాదు చేసిన తల్లి
- జీరో ఎఫ్ఐఆర్ ద్వారా పెందుర్తి పీఎస్‌కు బదిలీ చేసిన ఒడిశా పోలీసులు

పెందుర్తి: నరవ సమీపంలోని గవరజగ్గయ్యపాలెంలో ఉంటున్న ఓ భవన నిర్మాణ కార్మికుడు.. తన ఇద్దరు పిల్లలను కిడ్నాప్ చేసినట్లు ఓ మహిళ ఒడిశాలోని గంజాం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అక్కడి పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసును పెందుర్తి పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. వివరాలివి.. ఒడిశా రాష్ట్రం గంజాం ప్రాంతానికి చెందిన వినతి ప్రధాన్ గవరజగ్గయ్యపాలెం వలస వచ్చి ఇక్కడ జరుగుతున్న ఓ భవన నిర్మాణంలో పనికి కుదిరింది. ఆమె ఇద్దరు పిల్లలతో కలిసి నిర్మాణ సంస్థకు చెందిన గదిలో నివాసం ఉంటుంది. కాగా గంజాం ప్రాంతానికే చెందిన వాసుదేవ్ జల్లి అనే వ్యక్తి ఇదే నిర్మాణం కోసం పనిలో చేరాడు. అతడు వినతి ప్రధాన్ సోదరి(19)ని ఇష్టపడుతున్నానని, పెళ్లి చేసుకుంటానని కొన్నాళ్లుగా వేధిస్తున్నాడు. అందుకు ఒప్పుకోకపోవడంతో తన పిల్లలను (బాలిక(10) బాలుడు(8)) వాసుదేవ్ అపహరించుకుపోయినట్లు వినతి ప్రధాన్ గంజాం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై అక్కడి పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి పెందుర్తి పోలీస్ స్టేషన్‌కు కేసును బదిలీ చేశారు. ఈ మేరకు తమ బృందాన్ని ఒడిశాతో పాటు ఉత్తరప్రదేశ్‌కు పంపి పిల్లలు, నిందితుడి ఆచూకీ కోసం గాలిస్తున్నామని పెందుర్తి సీఐ రామకృష్ణ వెల్లడించారు.

'కోరమండల్' సేవలు స్ఫూర్తిదాయకం

వస్త్ర సంచులను ఆవిష్కరించిన కమిషనర్



వస్త్ర సంచులను ఆవిష్కరిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్, సంస్థ ప్రతినిధులు

డాబాగార్డెన్స్: కోరమండల్ ఫెర్టిలైజర్స్ చేస్తున్న సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ అన్నారు. కోరమండల్ ఫెర్టిలైజర్స్ కంపెనీ నగర ప్రజలకు ఉచితంగా అందించేందుకు స్వచ్ఛ సర్వేక్షణ్ 2024–ఎకో వైజాగ్ పేరిట రూపొందించిన 30 వేల వస్త్ర సంచులను బుధవారం కమిషనర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోరమండల్ ఉపాధ్యక్షుడు ఎం.జ్ఞానసుందరం మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు కోరమండల్ సంస్థ ఎప్పుడూ ముందుంటుందని, జీవీఎంసీ సౌజన్యంతో కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు. ఈ క్రమంలో ఎకో వైజాగ్ అంశంపై అవగాహనతో కూడిన 30 వేల వస్త్ర సంచులను రూపొందించామని, ఇందులో 15 వేల సంచులను జీవీఎంసీకి అందిస్తున్నట్లు తెలిపారు. మిగిలిన 15 వేల సంచులను మార్కెట్, నివాసిత ప్రాంతాల్లో పంపిణీ చేస్తామన్నారు. కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్ 2024లో విశాఖ దేశంలోనే ప్రథమ స్థానం సాధించే దిశగా యంత్రాంగం కృషి చేస్తోందని, ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి చెప్పి.. పర్యావరణ హిత వస్తువులనే వాడాలని పిలుపునిచ్చారు. కంపెనీ మాన్యుఫ్యాక్చరింగ్ హెడ్ ఆర్.శ్రీనివాసరావు, సీఎస్సార్ డిప్యూటీ మేనేజర్ ఎస్.వి.రమణ, సీనియర్ మేనేజర్ కె.శ్రీకాంత్, పీఆర్ కన్సల్టెంట్ యు.ఎస్. శర్మ పాల్గొన్నారు.

లోకమాన్య తిలక్ దారి మళ్లింపు


తాటిచెట్లపాలెం: సెంట్రల్ రైల్వే, పూణే డివిజన్ డౌండ్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న పనుల నిమిత్తం పలు రైళ్ల దారి మళ్లిస్తున్నట్లు, మరికొన్ని గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు.

- ఈ నెల 29 నుంచి ఆగస్టు 1 వరకు లోకమాన్య తిలక్ టెర్మినస్‌లో బయల్దేరే లోకమాన్య తిలక్ టెర్మినస్ - విశాఖపట్నం (18520) ఎక్స్‌ప్రెస్ రెగ్యులర్ మార్గంలో కాకుండా మళ్లించిన మార్గంలో వయా పూణే - మిరాజ్ - కుర్దువాడి మీదుగా నడుస్తుంది.
- ఈ నెల 30న భువనేశ్వర్‌లో బయల్దేరే భువనేశ్వర్ - పూణే (22882) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సోలాపూర్ వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఆగస్టు 1న పూణేలో బయల్దేరాల్సిన పూణే - భువనేశ్వర్ (22881) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ పూణే నుంచి కాకుండా సోలాపూర్ నుంచి బయల్దేరుతుంది. ఈ రైలు ఆయా తేదీల్లో పూణే – సోలాపూర్ మధ్య రాకపోకలు సాగించదు.

28న జిల్లా స్థాయి యోగాసనాల పోటీలు

మహారాణిపేట: సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో ఉన్న కృష్ణ మందిరంలో ఈ నెల 28న యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యోగాసనాల పోటీలు జరగనున్నాయి. విశాఖ యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ పర్యవేక్షణలో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ బాల, బాలికలు, స్త్రీ, పురుషులకు విభాగాల వారీగా ఈ పోటీలు నిర్వహిస్తామని అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి యు.రామారావు తెలిపారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు ఈ నెల 26లోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. 28న పోటీలకు హాజరైనప్పుడు ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ, 3 పాసుపోర్టు సైజ్ ఫొటోలను తప్పక తీసుకురావాలని సూచించారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారు సెప్టెంబరులో విశాఖలో జరిగే 49వ యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని, అక్కడ ఎంపికైన వారు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. పేర్లు నమోదుకు 99088 38387, 94403 01277, 91604 69686, 94917 66129 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని రామారావు కోరారు.

క్రేన్ ఢీకొని విశ్రాంత ఉద్యోగి దుర్మరణం



ప్రమాదానికి కారణమైన క్రేన్

తగరపువలస: ఆనందపురం మండలం వేములవలస కూడలిలో బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యుత్ శాఖ విశ్రాంత ఉద్యోగి షేక్ ఆలీ దుర్మరణం పాలయ్యారు. ఆనందపురం సీఐ టీవీ తిరుపతిరావు తెలిపిన వివరాలివీ.. వేములవలస మార్కెట్ వద్ద ఉన్న తన ఇంటి నుంచి పాత ఊరు వద్ద సీలింగ్ ఫ్యాన్ కొనేందుకు ఫ్లై ఓవర్ కింద నుంచి ఆలీ నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఆ సమయంలో వెనుకనే వస్తున్న క్రేన్ జోరుగా, అజాగ్రత్తగా వచ్చి అతన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో క్రేన్ కుడి చక్రం అతనిపై నుంచి వెళ్లగా నడుం, ఇతర భాగాలకు తీవ్రంగా గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతన్ని సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రికి చికిత్సకు తరలించగా.. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య నజీబ్ ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ గాంధీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువతి ఘటనపై లోతుగా విచారణ

మధురవాడ: పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో యువతి శరీరంపై గాయాల వ్యవహారం సస్పెన్స్‌గా మారింది. గాయాలకు కారణాలపై యువతి స్పష్టంగా సమాచారం ఇవ్వకపోవడంతో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. కొమ్మాది జంక్షన్ వద్ద ఉన్న ఒక బేకరీలో పనిచేస్తున్న 19 ఏళ్ల యువతి విధులు ముగించుకొని సోమవారం రాత్రి హాస్టల్‌కు గాయాలతో వెళ్లింది. ఆమె పరిస్థితిని చూసిన హాస్టల్ వార్డెన్ వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు అక్కడకు చేరుకుని యువతిని కేజీహెచ్‌లో చేర్పించారు. అయితే ఆమెపై ఎవరైనా అఘాయిత్యం చేశారా? లేదా దాడికి పాల్పడ్డారా? అన్నది సస్పెన్స్‌గా మారింది. దీనిపై బాధిత యువతి స్పష్టంగా జరిగిన విషయాన్ని చెప్పడం లేదని పోలీసులు అంటున్నారు. ఒకసారి తాను కింద పడిపోవడం వల్ల గాయాలయ్యాయని, మరోసారి ఎవరో ముఖంపై దాడి చేసి కిందకు తోసేసి మొబైల్ తీసుకొని పారిపోయారని చెప్పినట్లు పేర్కొంటున్నారు. యువతి ఫిర్యాదుపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఒక అనుమానితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఈ ఘటనపై మరింత లోతుగా విచారణ చేస్తున్నామన్నారు.

ప్రమాదాన్ని తప్పించి.. అనంతలోకాలకు..

- గుండెపోటుతో డ్రైవర్ మృతి
- నొప్పిని భరించి డివైడర్‌ను ఢీకొట్టిన వైనం
- ఆ సమయంలో లారీలో 300 గ్యాస్ సిలిండర్లు



డివైడర్‌పై నిలిచిన గ్యాస్ సిలిండర్ల లారీ



మృతి చెందిన డ్రైవర్ శ్రీనివాస్

మల్కాపురం: ఓ లారీ డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి పెను ప్రమాదం తప్పించినప్పటికీ.. తను మాత్రం గుండెపోటుతో లారీలోనే ప్రాణాలు విడిచాడు. ఈ విషాద ఘటనకు సంబంధించి మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలివీ.. అనకాపల్లి జిల్లా మాకవరపాలెంలో భార్య, ఇద్దరు పిల్లలతో శ్రీనివాస్(50) నివాసం ఉంటున్నాడు. అతను హెచ్‌పీ గ్యాస్ సిలిండర్లు సరఫరా చేసే లారీ డ్రైవర్‌గా కొంతకాలం నుంచి పని చేస్తున్నాడు. విధుల్లో భాగంగా 300 గ్యాస్ సిలిండర్లతో బుధవారం లారీని నడుపుతూ మారుతీ సర్కిల్ నుంచి వీడీఆర్ గొడౌన్ వైపు వస్తున్నాడు. మార్గమధ్యలో అతనికి ఛాతీలో నొప్పి రావడంతో చాకచక్యంగా వ్యవహరించాడు. గ్యాస్ సిలిండర్లతో ఉన్న లారీ బోల్తాపడితే పెను ప్రమాదం సంభవిస్తుందని భావించి పక్కన ఉన్న డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో లారీ ఆగింది. అయితే.. డివైడర్‌ను ఢీకొట్టిన కొద్దిసేపటికే, గుండెపోటుతో శ్రీనివాస్ లారీలోనే మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాద వివరాలు సేకరించి.. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. ఇంటి పెద్దదిక్కు మరణించడంతో అతని భార్య, కుటుంబసభ్యులు బోరున విలపించారు.

దళిత మహిళలపై దాడులు తగదు

- వారిపై దాష్టీకాలకు పాల్పడుతున్న వ్యక్తులను అరెస్టు చేయాలి
- హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుల డిమాండ్



మాట్లాడుతున్న హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా విశాఖ సిటీ ప్రెసిడెంట్ జోనహ

డాబాగార్డెన్స్: దళిత మహిళలపై దాడులకు పాల్పడుతూ, లైంగిక వేధింపులకు ప్రయత్నించిన దేవరపల్లి గణేష్, దేవరపల్లి పైడిరాజును అరెస్టు చేయాలని, పద్మనాభం మండలం పెంట పంచాయతీలో దళిత, బీసీ ప్రజలకు రక్షణ కల్పించాలని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు డిమాండ్ చేశారు. దళిత మహిళలను అసభ్య పదజాలంతో కించపరిచిన పద్మనాభం సీఐ, ఎస్ఐలపై చట్టపరమైన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా విశాఖ సిటీ ప్రెసిడెంట్ డి. జోనహ, పెంట పంచాయతీ దళితులు మాట్లాడారు. తప్పుడు కేసులతో దేవరపల్లి గణేష్, ఆయన కుటుంబీకులు గ్రామ ప్రజలను బెదిరిస్తూ కేవలం డబ్బు కోసం పోలీసులతో కుమ్మక్కై, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ ముసుగులో తప్పుడు కేసులు బనాయిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ ఈ విషయమై విచారణ జరిపి ఆ ప్రాంత ప్రజలకు ప్రాణ, మాన రక్షణ కల్పించాలని కోరారు. పెంట పంచాయతీ సర్పంచ్ బోదల పావని మాట్లాడుతూ పెంట గ్రామంలో ప్రజలందరూ ఉపయోగించే రహదారిని దేవరపల్లి గణేష్ ఆక్రమించి నిలదీసిన వారిపై కొడతానని, చంపుతానని బెదిరించడం, కత్తులు, గొడ్డలి పట్టుకుని దాడులు చేసేలా భయాందోళనలకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. దళితులు వ్యవసాయం చేసుకోవడానికి ప్రభుత్వం డి-పట్టా భూములు ఇచ్చిందని, వాటిని ఆధారంగా చేసుకుని దళిత ప్రజలు పండ్లు పండించుకుని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. అటువంటి మంచి వాతావరణాన్ని నాశనం చేస్తూ పద్మనాభం సీఐ, ఎస్సైలతో దిగిన ఫొటోలు చూపిస్తూ అందర్నీ జైలుకు పంపిస్తానని తరచూ ఇక్కడి ప్రజలను బెదిరిస్తున్నాడని చెప్పారు. దళిత నాయకులమంటూ దళారీ వ్యవస్థను నడుపుతున్న దేవరపల్లి గణేష్, అతని భార్య రవణమ్మ, తమ్ముడు పైడిరాజుపై చట్టరీత్యా చర్యలు చేపట్టాలన్నారు. ఈ విషయమై కలెక్టర్, పోలీస్ కమిషనర్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదన్నారు.